క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, మొయినాబాద్, అజీజ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా కనకమామిడి ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నక్కలపల్లి, తోలుకట్ట ఫీడర్ల పరిధిలో మధ్నాహ్నం 12.30గంటల నుంచి 2.30 గంటల వరకు, ఎస్‌వీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, చిలుకూరు, శ్రీనిధి ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయంలో సంబంధిత గ్రామాల ప్రజలు, వినియోగదారులు సహకరించగలరని ఆయన కోరారు.

అభినందన సభను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు ఏర్పాటు సంతోషకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. అనంతరం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో భాగంగా షాద్‌నగర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, కొత్తగూడెం ఎమ్మెల్యేగా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివ రావు గెలుపొందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా శనివారం షాద్‌నగర్ పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటుచేయనున్నట్లు దీనికోసం అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లేడ్ చౌదరిగూడ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకుడు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

వేములనర్వ సర్పంచ్ మంజుల



స్మిత సబర్వాల్‌తో సర్పంచ్ మంజుల

కేశంపేట: గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మిత సబర్వాల్‌ను గురువారం వేములనర్వ సర్పంచ్ మంజుల వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నేటివరకు మంజూరు చేయలేదని స్మిత సబర్వాల్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీలకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. ఈ విషయంలో స్మితసబర్వాల్ సానుకూలంగా స్పందించినట్టు ఆమె తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీల ఏర్పాటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన రావిర్యాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన రౌడి కిల్లర్ జట్టు రూ.10వేలు వెచ్చించి మూడు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, మహేశ్ శర్మ, అశోక్, సలీం, నవీన్, భాస్కర్, ఆసీఫ్, ప్రకాశ్, సత్యం, నరేశ్, రవి పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలులో వేగం పెంచండి

షాబాద్ ఎంపీడీఓ అనురాధ

షాబాద్: గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూలును వేగంగా చేయాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. అభివృద్ధి పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో గ్రామసభల ద్వారా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకొని ఆమోదింపచేసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమానికి గాను నర్సరీల్లో విత్తనాలు నాటించి మొక్కలు పెంచాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించామన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ హన్మంతరెడ్డి, ఏపీఓ వీరాసింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'అభయహస్తం' ప్రక్రియ పూర్తి

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు
- మిగిలింది లబ్ధిదారుల ఎంపికే
- ఎంపీడీఓ వినయ్‌కుమార్



దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

షాద్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత ఆరు పథకాల అమలులో భాగంగా రెండు పథకాలను అమలు చేసింది. మిగితా పథకాలకు సంబంధించి డిసెంబర్ 28న ప్రారంభించి జనవరి 6వరకు అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో భాగంగా మహాలక్ష్మీ, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పేరిట ఐదు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పథకాల కోసం భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాలతో పాటుగా, షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో 90,254 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఈ నెల 12 నుంచి 17 వరకు చేపట్టారు. అధికారులు కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను వినియోగించుకొని నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేశారు.

మార్గదర్శకాలు వస్తేనే...

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయినా లబ్ధిదారుల ఎంపిక ఎలా చేపడుతారన్నదానిపై ప్రభుత్వంనుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మహాలక్ష్మీ పథకానికి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇళ్ల కోసం చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు.

దరఖాస్తుల వివరాలు.. ఇలా ఉన్నాయి..

మండలం	వచ్చిన దరఖాస్తులు
కొత్తూరు	5,847
కొందుర్గు	9,345
జిల్లేడు చౌదరిగూడ	9,912
కేశంపేట	13,801
ఫరూఖ్‌నగర్	19,859
నందిగామ	9,124
కొత్తూరు	4,011
షాద్‌నగర్ మున్సిపాలిటీ	18,355

వందశాతం పూర్తి చేశాం



ప్రభుత్వ పథకాల కోసం ప్రజాపాలనలో భాగంగా ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నమోదు చేశాం.
– వినయ్‌కుమార్, ఎంపీడీఓ, ఫరూఖ్‌నగర్

లబ్ధిదారుల ఎంపికకు తెల్లరేషన్‌కార్డు, ఆధార్ నంబర్లను ప్రామాణికంగా తీసుకుంటారని తెలుస్తుంది. అయితే అధికారులు ఇంటింటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి వివరాలు సేకరించి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తుంది.

మెరుగైన ఫలితాలకు కృషి

- విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమానికి పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి కావాల్సిన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంఈఓలు శంకర్ రాథోడ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైమానిక ప్రదర్శనలో..

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వింగ్స్ ఇండియా–2024 ఏవియేషన్ కార్యక్రమం హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ప్రారంభమయింది. ఈ ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు

చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు

మొయినాబాద్/చేవెళ్ల: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ సీట్లలో ప్రయాణికులను కూర్చొపెట్టొద్దన్నారు. ప్రతీ ఆటోడ్రైవర్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ యూనిఫాం తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం



జెడ్పీ పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్

కేశంపేట: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్ అన్నారు. కొత్తపేట, పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి, వేములనర్వ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాససాగర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. నిలిచిపోయిన బదిలీల ప్రక్రియను వెంటనే కొనసాగించాలన్నారు. నోడల్ అధికారి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, రాష్ట్ర అసోసియేట్ అబ్దుల్‌బారీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నారెడ్డిగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లవేళల ముందుంటామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, కైలా నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మొయినాబాద్/చేవెళ్ల: ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రోగానికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్, గణేష్, ఎల్లయ్య, స్వప్న, సీత, గీత, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



షాద్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

తెలుగు జాతి గౌరవాన్ని పెంచిన మహానేత ఎన్టీఆర్ అని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నేతలు కొనియాడారు. గురువారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. వివిధ గ్రామాలు, పట్టణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



మొయినాబాద్ రూరల్ నివాళులర్పిస్తున్న విద్యా సంస్థల డీన్ డాక్టర్ ఎంవి రామారావు



మొయినాబాద్/చేవెళ్ల: ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు: మండలంలోని వెంకిర్యాల సంజీవపురం చింతల శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. వెంకిర్యాల, తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాల ప్రజలు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి దేవాలయ ఆవరణలో భజనలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం, తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ, మాచిరెడ్డి, సర్పంచులు లింగం గౌడ్, బాల్‌రాజ్, శ్రీధర్ రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు కేంద్ర పథకాలు



చర్లగూడలో వికసిత్ భారత్ యాత్రలో కిరణ్

బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్

షాబాద్: ప్రతీ గడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో వికసిత్ భారత్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఆయుష్మాన్ భారత్, పీఎం జేవై, పీఎం గరీబ్ కల్యాణ్, అన్నా యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన తదితర 17 రకాల పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, వెంకటేష్‌గౌడ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

మొయినాబాద్/చేవెళ్ల: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ అన్నారు. గురువారం చేవెళ్ల డివిజన్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిల నమోదు, బాలింతల సంరక్షణ, పర్యవేక్షణ, శిశుపోషణ ఎప్పటి కప్పుడు చేయాలన్నారు. సకాలంలో టీకాలు వేయాలని, ఇంటింటి సర్వే నిర్వహించి ఆరోగ్య సంరక్షణ కార్డుల నిర్వహణ చేపట్టాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సంతోష, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, బలరాం, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద సేవా పురస్కార్‌కు డాక్టర్ సంధ్య ఎంపిక



డాక్టర్ సంధ్య

షాద్‌నగర్ రూరల్: వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి నవభారతీ నిర్మాణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వివేకానంద సేవా పురస్కార్‌లను అందజేస్తున్నట్లు చైర్మన్ బత్తుల హేమంత్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన షాద్‌నగర్ పట్టణానికి చెందిన డాక్టర్ సంధ్య ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

సేవా 'నిరంజనుడు'

- నక్కలపల్లి అభివృద్ధికి చేయూత
- సొంత డబ్బులు వెచ్చించి సౌకర్యాల కల్పన
- ప్రజల మన్ననలు అందుకుంటున్న నిరంజన్‌గౌడ్



గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులతో అంబులెన్స్ ప్రారంభిస్తున్న నిరంజన్‌గౌడ్

మొయినాబాద్ రూరల్: నక్కలపల్లికి చెందిన అడ్వకేట్ నిరంజన్‌గౌడ్ అభివృద్ధే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఊరు బాగుండాలి.. అందులో మనం ఉండాలి అన్న చందంగా సాగిపోతున్నారు. సొంత డబ్బులు వెచ్చించి గ్రామానికి ఉచిత వాటర్ ఫిల్టర్ ప్లాంట్, అంబులెన్స్‌తో పాటు డ్రైవర్‌ను ఏర్పాటు చేశారు. అండర్ డ్రైనేజీ మురుగు కాలువల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చేయూతనిచ్చారు. నిరజంన్‌గౌడ్ సేవలు అభినందిస్తూ సర్పంచ్ స్వరూప అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో స్థానికులు అతన్ని ఘనంగా సన్మానించారు.

అంబులెన్స్ ఏర్పాటు అభినందనీయం..



అత్యవసర పరిస్థితుల్లో మా గ్రామం నుంచి మొయినాబాద్ లేదా హైదరాబాద్ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. విషయం తెలుసుకున్న నిరంజన్‌గౌడ్ అత్యవసర సేవల నిమిత్తం 24గంటల పాటు అంబులెన్స్ ఏర్పాటు చేయించారు.
– ఎంపీ నర్సింహులు, నక్కలపల్లి

అభివృద్ధే లక్ష్యం..



నక్కలపల్లి అన్ని రంగాల్లో ముందుండాలనేదే నా ఆశయం. ఇందుకోసం నావంతు కృషిచేస్తున్నా. ప్రజా సమస్యల పరిష్కారానికి నా చేతనైన సాయం చేస్తా. అందరూ బాగుంటే ఊరు బాగు పడుతుంది.
– నిరంజన్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

న్యాయ సహాయం అందించారు



2018లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నా భర్త మృతి చెందారు. ఈ విషయంలో న్యాయ సహాయం అందేలా చూశారు. మా పరిస్థితిని తెలుసుకొని ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా, సంబంధిత వ్యక్తుల నుంచి రూ.5 లక్షల పరిహారం ఇప్పించారు.
– లక్ష్మి, స్థానికురాలు